క్లుప్తంగా

ఫిజియోథెరపీతో స్వస్థత

బల్లికురవ: వైకల్యం కలిగిన పద్దెనిమిది సంవత్సరాల్లోపు చిన్నారులు ఫిజియోథెరపీతో స్వస్థత పొందవచ్చని ఫిజియోథెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. బుధవారం బల్లికురవలోని భవిత కేంద్రంలో పరీక్షలు నిర్వహించారు. నాగబాబు, నాజిలి పాల్గొన్నారు.

ఎంపీడీఓ కుటుంబానికి న్యాయం చేయాలి

అద్దంకి: పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీఓగా పనిచేస్తూ కొందరి ఒత్తిళ్లకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న ఎంపీడీఓ కుటుంబానికి న్యాయం చేయాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ అన్నారు. కొందరి ఒత్తిళ్లకు గురై ఆత్మహత్య చేసుకున్న వెంకట రమణ ఆత్మకు శాంతి చేకూరాలని సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు. అద్దంకి ఎంపీడీవో మాట్లాడుతూ ఉద్యోగులపై ఒత్తిళ్లు తెచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థికి రోటరీ సాయం



విద్యార్థినికి నగదు అందిస్తున్న రోటరీ సభ్యులు

చీరాల అర్బన్: విద్యార్థిని చదువు నిమిత్తం రోటరీ క్లబ్ సభ్యులు ఆర్థిక సహాయాన్ని బుధవారం పంపిణీ చేశారు. బోగిరెడ్డి సంయుక్త అనే విద్యార్థిని రోటరీ క్లబ్ చీరాల ఆర్థిక సహాయంతో విజయవాడ శ్రీ చైతన్య కాలేజీలో ఐఐటీ కోచింగ్ తీసుకుని ఇంటర్‌లో 980 మార్కులు సాధించింది. అలాగే బీహార్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పాటాన్‌లో సీటు సాధించిందని చెప్పారు. రూ.20 వేలను సభ్యులు బండారుపల్లి హేమంత్‌కుమార్ వితరణగా ఇచ్చారు. క్లబ్ సభ్యులు చీరాల కృష్ణమూర్తి, నక్కల సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, దోగుపర్తి వెంకట సురేష్, డాక్టర్ ఐ.బాబూరావు, మామిడాల శ్రీనివాసరావు, హరినారాయణ, రోటరీ సభ్యులు హాజరయ్యారు.

230 క్యూసెక్కుల నీరు విడుదల



రామకూరు రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

జె.పంగులూరు: ప్రస్తుతం రామకూరు రెగ్యులేటర్ నుంచి పమిడిపాడు మేజర్‌కు 230 క్యూసెక్కుల నీరు వస్తోందని ఎస్ఎస్ఈ డీఈ బాపయ్య అన్నారు. మండల పరిధిలోని రామకూరు రెగ్యులేటర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. పమిడి పాడు మేజర్ పరిధిలో 12 నోటిఫైడ్ చెరువులు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం 230 క్యూసెక్కుల నీరు వస్తోందని, 300 క్యూసెక్కులు విడుదల చేయగలిగితే 12 చెరువులను 75 శాతం నీటితో నింపవచ్చన్నారు.

జీవాల పెంపకంలో జాగ్రత్త

చీరాల టౌన్: పాడి పశువుల పెంపకం, జీవాల ఆరోగ్యంపై పశుపోషకులు జాగ్రత్తగా ఉండాలని ఈపురుపాలెం పశువైద్యులు పావని సూచించారు. బుధవారం మండలంలోని ఈపురుపాలెం గ్రామ పంచాయతీలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని చేశారు. టీకాలు, పాల ఉత్పత్తి పెరిగేందుకు అవసరమైన దాణా, అనారోగ్యంతో ఉన్న జీవాలకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

రికవరీలు వేగవంతం చేయాలి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకునేలా కృషి చేయాలని ఏపీఎం బి.సుబ్బారావు సూచించారు. బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం మాట్లాడుతూ మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సామాజిక పెట్టుబడి నిధి రికవరీలు రూ.45 లక్షలు ఉండగా రూ.37 లక్షలు వసూళ్లు చేశారని, మిగిలిన రికవరీలు త్వరగా చేయాలన్నారు.

ఎంపీడీఓ వెంకటరమణకు నివాళి



వెంకటరమణారావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధికారులు

జె.పంగులూరు: ఏలూరు జిల్లా నరసాపురం ఎంపీడీఓ వెంకటరమణారావు అకాల మరణానికి సంతాపం తెలుపుతూ బుధవారం ఎంపీడీఓ మాధ్యూబాబు నివాళులర్పించారు. ఆయన ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొంత సమయం మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాధ్యూబాబు మాట్లాడుతూ ఎంపీడీఓ వెంకటరమణారావు మరణం చాలా బాధకు గురిచేసిందన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు వారి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాంతకం



ఆటోవాలాలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సురేష్



పర్చూరు బొమ్మల సెంటర్ వద్ద హెల్మెట్ ప్రాముఖ్యత వివరిస్తున్న అంకమరావు

- తలకు గాయాలైన కేసుల్లో ఎక్కువ మరణాలు
- హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం తప్పినట్లే
- బాపట్ల ఏఎంవీ ఇన్‌స్పెక్టర్ అంకమరావు

పర్చూరు (కారంచేడు): ప్రయాణ సమయంలో ద్విచక్రవాహనదారులు తప్పకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు హెల్మెట్‌లను ధరించాలని, హెల్మెట్‌లు లేని ప్రయాణం ప్రాణాలకు ప్రమాదమని బాపట్ల అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం. అంకమరావు అన్నారు. బుధవారం పర్చూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బస్‌స్టాండ్ సెంటర్ నుంచి సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ పెట్టుకుంటే.. ఎక్కువగా చెమటలు పడతాయని, అసౌకర్యంగా ఉంటుందని, ఎవరో చూసి ఎగతాళి చేస్తున్నారనే సాకులతో ధరించిన హెల్మెట్‌ను కూడా తీసి ప్రయాణిస్తే మృత్యువును ఆహ్వానించినట్లేనన్నారు. తలల గాయాలై తీవ్ర రక్తస్రావం జరుగుతున్న కేసుల్లో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదులు ఆర్. రమేష్, పి. జాన్‌బాబు, పోలీస్, కోర్టు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలతో ఆనందం

కారంచేడు: రోడ్డు భద్రతా నియమాలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కె. సురేష్ హెచ్చరించారు. బుధవారం కారంచేడు కాలువ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదాలు–వాటి నివారణ చర్యలపై ద్విచక్రవాహనదారులు, ఆటోవాలాలకు అవగాహన కల్పించారు. మీరు బైటకు వచ్చిన తరువాత మీ ఇంటి దగ్గర తల్లిదండ్రులు లేదా, భార్య బిడ్డలు ఎదురు చూస్తుంటారనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. నాలుగు రూపాయల కోసం కక్కుర్తి పడి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దన్నారు హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాపాయానికి దారితీస్తుందని హెచ్చరించారు.

ముద్ద వ్యాధి నిరోధక టీకాలు వేయించండి



కారంచేడు సూచనలిస్తున్న డాక్టర్ హనుమంతరావు



ఆవులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

చీరాల అర్బన్: తెల్ల ఆవులు, ఎద్దుల్లో వచ్చే ముద్ద వ్యాధికి నిరోధక టీకాలు వేయించుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. బుధవారం పాపరాజుతోటలోని శ్రీకృష్ణ గోశాలలో ముద్ద వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఆయన మాట్లాడుతూ గోశాలలను యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా, విజయవాడ పేరుతో రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. చీరాల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ సజ్జా చిట్టిబాబు, శ్రీకృష్ణగోశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కారంచేడు: గోశాల్లోని గోమాతలకు వ్యాపించే ముద్ద చర్మపు వ్యాధుల నివారణకు తప్పనిసరిగా అవసరమైన టీకాలు వేయించాలని బాపట్ల జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం కారంచేడులో గోమాత సంరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే గోశాలను ఆయన సందర్శించారు. యానిమల్ వెల్ఫేర్ బోర్డులో గోశాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పర్చూరు అడిషినల్ డైరెక్టర్ డాక్టర్ మాధవి, కారంచేడు పశువైద్యాధికారి డాక్టర్ భాగ్యరాజ్, కారంచేడు, కుంకలమర్రు సెంటర్ల సిబ్బంది పాల్గొన్నారు.

బేటీ పడావో బేటీ బచావో



రేణింగవరంలో మాట్లాడుతున్న సీడీపీఓ కృష్ణకుమారి

జె.పంగులూరు: మండల పరిధిలోని రేణింగవరం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సీడీపీఓ క్రిష్ణకుమారి ఆధ్వర్యంలో బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అడపిల్లలను చదివిదాం, అడపిల్లలను పుట్టనిదాం, ఆడపిల్లను బతకనిద్దాం, రక్షిద్దాం అనే నినాదంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. సూపర్ వైజర్ పద్మజ, అంగన్‌వాడీలు కృష్ణకుమారి, షైనీ, కిశోర బాలికలు పాల్గొన్నారు.

వాన్ పిక్ భూములు పరిశీలించిన జేసీ

చినగంజాం: మండలంలోని మోటుపల్లి పంచాయితీ పరిధిలోని వాంపిక్ భూములను జాయింట్ కలెక్టర్ బి. సుబ్బారావు బుధవారం పరిశీలించారు. 272లోని వాన్ పిక్ భూములను ఆయన పరిశీలించి వాటిలో ఇప్పటివరకు సబ్ డివిజన్ చేయని భూముల గురించి విచారించారు. రెవెన్యూ రికార్డుల్లో ఆ భూములకు సంబంధించి సబ్ డివిజన్ చేయకపోవడంతో ఆయన రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. ఆర్డీఓ సూర్యనారాయణ రెడ్డి, ఇన్చార్జి తహసీల్దార్ శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా వర్ధంతి



గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



అద్దంకి: నివాళులర్పిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు, సాహిత్య వేత్తలు, సంఘసేవకులు

చీరాల: కవి కోకిల గుర్రం జాషువా 53వ వర్ధంతిని బుధవారం విజయనగర్‌కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో తేళ్ళ రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో అంటరాని కులంలో పుట్టి తన విద్య, మేధస్సు ద్వారా సమాజానికి పద్య, కవితల రూపంలో సేవ చేశారని కొనియాడారు. అటువంటి మహోన్నత వ్యక్తిని స్మరించుకోవడం సమాజానికి, భావితరాలకు ఎంతో అవసరమన్నారు.

జాషువా సంఘ సంస్కర్త

అద్దంకి రూరల్: గుర్రం జాషువా కవి మాత్రమే కాదని మంచి సంఘ సంస్కర్త అని సాహితీ వేత్త అన్నమనేని వెంకట్రావు అన్నారు. బుధవారం జాషువా 53 వర్ధంతిని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ తన కవితలు, పద్యాల ద్వారా సమాజంలోని కులమత అంటరానితనంతో పాటు ఇతర రుగ్మతలను మహాకవి జాషువా అన్నారు. పలువురు వక్తలు జాషువా కవిత్వం, వ్యక్తితత్వం గురించి కొనియాడారు.

రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో...

గుర్రం జాషువా 53 వవర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త పసుమర్తిపాలెంలోని జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జ్యోతి చంద్రమౌళి, దివాకరదత్తు, అన్నమనేని వెంకట్రావు, చెన్నుపాటి రామాంజనేయులు, పీసీహెచ్ కోటయ్య, రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, చుండూరి మరళి సుధాకరరావు, మాలాది శ్రీనివాసరావు, అద్దంకి లెవీ ప్రసాద్, మన్నం త్రిమూర్తులు జ్యోతి రమేష్ పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు విజయవంతం

చినగంజాం: గౌరవ ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు చీరాల మండల న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో స్థానిక సోపిరాల రైల్వే గేటు కూడలి వద్ద బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. హెల్మెట్ లేని వాహనదారులకు భారీగా జరిమానా విధిస్తామన్నారు. జి.విఠల్ రెడ్డి, పీఎల్‌వీ శ్రీ, వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

వలపర్లలో క్రీడా పోటీలు ప్రారంభం

మార్టూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శిక్ష సప్తాహం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వలపర్లలో బుధవారం ప్రధానోపాధ్యాయురాలు ఎం. నిర్మల విద్యార్థులకు క్రీడా పోటీలు ప్రారంభించారు. బాలబాలికలు పలు పోటీల్లో పోటీ పడ్డారు. కార్యక్రమంలో పీఈటీ రవి, దేవరాజు ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

28న సర్వసభ్య సమావేశం

మార్టూరు: మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి. నితిన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నిర్వహించాల్సిన సమావేశం అసెంబ్లీ, పార్లమెంటు సమావేశాల సందర్భంగా వాయిదా వేసినట్లు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దొనకొండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న జి.కోటేష్, ఎంపీ సంజన వ్యాయామ ఉపాధ్యాయులు కాలే నరసింహారావు ప్రోత్సాహంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21వ తేదీన పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన సెలక్షన్స్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరూ ఈ నెల 25 నుంచి 28 వరకు హర్యానా రాష్ట్రంలోని ఖరక్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టులో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసి వారిని అభినందించారు. పాఠశాలకు మంచి పేరు తెచ్చిపెట్టాలని ప్రధానోపాధ్యాయులు వీవీ రామాంజనేయులు, జి.కోటేశ్వరరావు ఆకాంక్షించారు.

పారదర్శకంగా లెప్రసీ గుర్తింపు సర్వే



కుష్టువ్యాధిపై సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

పుల్లలచెరువు: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మీనరసింహం అన్నారు. బుధవారం మండలంలోని నాయుడుపాలెం లెప్రసీ సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క ఇంటినీ వదలకుండా ప్రతి ఒక్కరికీ కుష్టు నిర్ధారణ పరీక్ష చేయాలన్నారు. స్పర్శ లేని మచ్చలు, రాగి రంగులో మచ్చలు, ఒకటి లేదా ఐదు మచ్చలు ఉంటే వ్యాధిగా అనుమానించి వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. ఈ సర్వే ఆగస్టు 2వ తేదీ వరకు గ్రామాల్లో సాగుతోందని, ఈ వ్యాధి గురించి భయపడాల్సిన పనిలేదన్నారు. వ్యాధి తగ్గేందుకు పూర్తి స్థాయిలో మందులు ప్రభుత్వ వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని, దీనిపై ప్రజలు పూర్తి అవగాహన పెంచుకుని జాగ్రత్తగా ఉండాలన్నారు. వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పెంపకంపై అవగాహన

దొనకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులకు పండ్ల తోట పెంపకంపై బుధవారం అవగాహన కల్పించారు. ఎంపీడీఓ వి.వసంతరావునాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ పీవీ రమణ, అగ్రికల్చర్ అధికారి ఆర్.రమేష్, డూమా కోర్స్ డైరెక్టర్ శ్యాంసన్ పాల్గొని మాట్లాడారు. పండ్ల మొక్కలు ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉచితంగా అందజేస్తున్నారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మురుగుతో అనారోగ్యం



అంబడిపూడిలో గుంతను పరిశీలిస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: గ్రామాల్లో మురుగు నిల్వలవల్లే దోమల ఉత్పత్తితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జి. రవితేజ అన్నారు. బుధవారం పెద అంబడిపూడిలో పీడీపీ ప్రోగ్రామ్‌లో భాగంగా వాడని ఖాళీ తొట్లు రోళ్లు, బోర్లించడంతోపాటు, మురుగు గుంటలను ఆయన పరిశీలించారు. లిక్విడ్ స్ప్రేతో పాటు మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వదిలారు. ప్రతి ఒక్కరూ దోమ కాటుకు గురికాకుండా తగు జాగ్రత్తలు వహించాలని వైద్యాధికారి ప్రజలకు సూచించారు. జలుబు, జ్వరంతో అస్వస్థతకు గురైతే తక్షణమే అందుబాటులో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు.

సేంద్రియ వ్యవసాయం రైతుకు లాభం



స్వర్ణలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

స్వర్ణ (కారంచేడు): భూసార పరీక్షల ఆధారిత ఎరువుల వినియోగంతో పాటు, ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం అన్నదాతలకు మేలు చేస్తుందని బాపట్ల డీఆర్‌సీ డైరెక్ట్ కోఆర్డినేటర్ డీడీఏ ఎం. విజయనిర్మల అన్నారు. బుధవారం స్వర్ణ రైతు సేవాకేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయం వలన తక్కువ పెట్టుబడులతో మంచి దిగుబడులు సాధించి, అందుకు తగిన గిట్టుబాటు ధరలను సాధించే అవకాశం ఉందన్నారు. బాపట్ల ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్. బాలమురళీధర్ మాట్లాడుతూ పంటలకు సోకే పురుగులను నిర్మూలించేందుకు లింగాకర్ష బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కాండం తొలుచు పురుగుల నివారణ కోసం ట్రైకోడెర్మావిరిడిని వినియోగించుకొని వాటి ఉధృతి తగ్గించుకోవచ్చన్నారు. డీఆర్‌సీ ఏడీఏ రత్నకుమారి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులపై దృష్టి సారించాలన్నారు. డాట్ సెంటర్ సైంటిస్ట్ డాక్టర్ జె. రాధాకృష్ణ మాట్లాడుతూ వరి పంటల సాగులో ఒక్క చదరపు మీటరు విస్తీర్ణానికి 33 కుదుళ్ళు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏడీఏ మోహనరావు, ఏఓ సుధీర్‌బాబు, హెచ్ఓ పి. అలేఖ్య, సీహెచ్ అప్పారావు, సర్పంచ్ మోటాని మధుసూదనరవు పాల్గొన్నారు.

విద్యార్థికి సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ చేయూత



విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఒంగోలు సెంట్రల్: పేద విద్యార్థి గీతాంజలికి నీట్ కోచింగ్‌కు అయ్యే ఖర్చును అందించి సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ చేయూత ఇచ్చింది. విద్యార్థి గీతాంజలి తండ్రి విద్యుదాఘాతంతో మృతి చెందగా, తల్లి కుట్టుమిషన్ పెట్టుకుని జీవనం సాగిస్తోంది. విద్యార్థి గీతాంజలి ఇంటర్‌లో మంచి మార్కులు సాధించి నీట్ కోచింగ్ తీసుకుంటూ ఆర్థిక చేయూత కోసం ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ బాషను సంప్రదించారు. స్పందించిన దాత సహకారంతో రూ. 30వేలు ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ చైర్మన్ మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డురాకూడదని ఎందరో విద్యార్థులను సూర్యశ్రీ ట్రస్ట్ అండగా నిలుస్తుందన్నారు. ట్రస్టు సెక్రటరీ సర్దార్ బాష మాట్లాడుతూ పేద విద్యార్థులు మంచి మార్కులతో చదువుకుంటే ఉన్నత చదువులకు తప్పకుండా ట్రస్ట్ తరుపున ఆర్థికసాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నల్లూరి మోహనరావు, ది సేవ్ యానిమల్ ఫౌండేషన్ నిర్వాహకురాలు దివ్య, తాటిపర్తి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెంకట రమణయ్య సేవలు శ్లాఘనీయం



అయ్యంకి వెంకట రమణయ్యకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

వేటపాలెం: గ్రంథాలయ ఉద్యమ నేత, గ్రంథాలయ పితామహుడు దివంగత అయ్యంకి వెంకట రమణయ్య 134వ జయంతిని దేశాయిపేట శాఖ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకులు డి. ధనమ్మ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమకారుడు, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులు, పత్రికా సంపాదకుడుగా పేరు గాంచిన గ్రంథాలయ సర్వస్వం అనే పత్రికను నిర్వహించారని గుర్తుచేశారు. ఆయన గంథాలయ ఉద్యమంలో జీవి తాంతం విశేష కృషి చేశారని కొనియాడారు. పంచాయతీ కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, ఎం. శ్రీనివాస్, టి. కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా వస్తువుల పంపిణీ అభినందనీయం



పాఠశాలకు క్రీడా వస్తువులను అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

బల్లికురవ: బ్యాంకు సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు క్రీడా వస్తువులను అందజేయడం అభినందనీయమని ఉప్పమాగులూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం ఏడుకొండలరావు అన్నారు. బుధవారం గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఆవిర్భావ వేడుకల్లో భాగంగా సుమారు పదివేల రూపాయల విలువ చేసే క్రికెట్, వాలీబాల్, క్యారమ్స్ కిట్‌లను పాఠశాలకు అందజేశారు. బ్రాంచ్ మేనేజర్ సత్యవేటి ధన్‌పాల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపుతూ అత్యుత్తమ క్రీడాకారులుగా రాణించాలన్నారు. పాఠశాల పీడీ కేవీ మురళి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి ఫలితాలు కీలకం



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ

బల్లికురవ: విద్యార్థి దశలో పదో తరగతి ఫలితాలు అత్యంత కీలకమని విద్యా సంవత్సర ఆరంభం నుంచే కష్టపడటంతో పాటు ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని డిప్యూటీ ఈఓఎం.నిర్మల కోరారు. బుధవారం మండలంలోని ఉప్పమాగులూరు ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు మధ్యాహ్నం భోజనం ఉపాధ్యాయుల డెయిరీ, లెసన్ ప్లాన్, తనిఖీతో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. తరువాత పదో తరగతి విద్యార్థులను తరగతుల వారీగా ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి సంతృప్తి చెందారు. షెడ్యూల్ ప్రకారం నిర్వహించే పరీక్షల్లో ప్రతి తరగతిలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణతో తీర్చి దిద్దాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణలను పరిశీలించిన జేసీ



ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న జేసీ

అద్దంకి రూరల్: అద్దంకిలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను బుధవారం జేసీ సుబ్బారావు పరిశీలించారు. స్థానిక ఎన్టీఆర్ నగర్, ఊరచెరువు స్థలం గత కొంత కాలంగా ఆక్రమణకు గురవుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను వెంట తీసుకుని పట్టణంలోని ఆయా స్థలాలను పరిశీలించారు. ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.